ముందుకు కదలని మురుగు!

- మోపిదేవిలో అధ్వానంగా మురుగు కాలువలు
- బ్లీచింగ్ పనులు కూడా నిర్వహించని పంచాయతీ అధికారులు

మోపిదేవి: గ్రామ పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మురుగు కాలువలు అస్తవ్యస్తంగా తయారవుతున్నాయి. దీంతో దోమలు వ్యాప్తి చెంది అనారోగ్యానికి గురవుతున్నామని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. మండల కేంద్ర మైన మోపిదేవిలో రోజూ వేలాది మంది భక్తులు, ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా మురుగు నీరు కాలువల్లో నిల వడంతో దుర్వాసన వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు కనీసం బ్లీచింగ్ కూడా చల్లడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పేరుకుపోతున్న మురుగు..

డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో మురుగు ఎక్కువగా పేరుకుపోయి దోమలు వ్యాపిస్తున్నాయని.. ఫలితంగా వ్యాధుల బారిన పడుతున్నామని ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో డయేరియా వ్యాపించినట్లు ప్రచారంలో ఉండగా, అధికారులు మేలుకోవపోవడంపై స్థానిక ప్రజలు, భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక అధికారులు స్పందించి డ్రైనేజీలు బాగు చేయడంతో పాటు మురుగు నిల్వ ఉన్న చోట బ్లీచింగ్ చల్లి ప్రజల ఆరోగ్యం కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భక్తులకు అసౌకర్యం..

జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మోపిదేవి శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకునేందుకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు రోజూ అధిక సంఖ్యలో వస్తారని.. అటువంటి మహా పుణ్యక్షేత్ర ప్రదేశంలో ఈ విధంగా డ్రైనేజీ అస్తవ్యస్తంగా తయారవ్వడం గమనార్హమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. తక్షణమే గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు చెబుతున్నారు. వాడుకలో ఉన్న మంచి నీటి కుళాయి సైతం మురుగు కూపంలో నానుతుందని.. దీనిపై స్పందించకుంటే ప్రమాదమని స్థానిక మహిళలు వాపోతున్నారు.



మోపిదేవిలో డ్రైనేజీలో నిలకడగా మురుగు



కుళాయి పంపు చుట్టూ నిలిచిన మురుగు

కాపు సంక్షేమ పథకాలపై నిర్లక్ష్యం వీడాలి

నాగాయలంక: కాపుల సంక్షేమ పథకాల అమలుపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని కాపునాడు నాయకులు అన్నారు. దివిసీమలోని వివిధ మండలాల కాపు నేతలతో స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఆదివారం అవనిగడ్డ నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. నియోజకవర్గం కాపునాడు అధ్యక్షుడు భోగాది సోమశేఖర్(చిన్నారి)అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ పీవీఆర్ కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు సంకటి లక్ష్మణరావు మాట్లాడుతూ.. కాపు విద్యార్థులకు విదేశీ విద్యా వసతి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ నియామకానికి నేటికీ కార్యాచరణ చేపట్టిన దాఖలాలు లేవని ఎద్దేవా చేశారు. కాపుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం కార్యాచరణ ప్రకటించకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు వెనుకాడేది లేదని లక్ష్మణరావు హెచ్చరించారు. కార్తీక వన సమారాధన ఏర్పాటులో రాష్ట్ర, జిల్లా కాపు నేతలను ఆహ్వానించి నియోజకవర్గం స్థాయిలో ఐక్యతా సమావేశం జరుపుతామని నియోజకవర్గ కాపునాడు అధ్యక్షుడు సోమశేఖర్ ప్రకటించారు. ఈ సందర్భంగా కాపునాడు నియోజకవర్గం కార్యదర్శిగా అర్జా బుచ్చిబాబును నియమించారు. అలానే ఆరు మండలాల అధ్యక్ష, కార్యదర్శులను ప్రకటించి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గాజుల లక్ష్మీనారాయణ, తోట శ్రీనివాసరావు, ఆరు మండలాల కాపు ప్రతినిధులు పాల్గొన్నారు.



నూతన మండలాల అధ్యక్ష, కార్యదర్శులకు నియామక పత్రాలు అందిస్తున్న నాయకులు

దారపు శ్రీనివాస్ సేవలు చిరస్మరణీయం

చిలకలపూడి(మచిలీపట్నం): ఏపీ ఎన్జీవో అసోసియేషన్ తూర్పు కృష్ణాజిల్లా కార్యదర్శి, గుడ్లవల్లేరు ఎంపీడీవోగా పని చేసి పదవీ విరమణ చేసిన దారపు శ్రీనివాస్(63) సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు వ్యాఖ్యానించారు. ఆయన సంస్మరణ సభను స్థానిక జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గవర్నర్ కార్యాలయ జాయింట్ సెక్రటరీ పీఎస్ సూర్యప్రకాష్ మాట్లాడుతూ.. తాను జిల్లా పరిషత్ సీఈవోగా పనిచేసిన సమయంలో దారపు శ్రీనివాస్ పరిచయమయ్యారని పేర్కొన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ.. దారపు శ్రీనివాస్ చిన్ననాటి నుంచి ఎంతో స్నేహంగా ఉండేవారని అన్నారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్ మాట్లాడుతూ.. దారపు శ్రీనివాస్ మరణం తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉల్లి కృష్ణ, జెడ్పీ డెప్యూటీ సీఈవో ఆర్‌సీ ఆనంద్‌కుమార్, తూర్పు గోదావరి జిల్లా డ్వామా పీడీ ఎ.నాగమహేశ్వరరావు, పలు ఉద్యోగ సంఘాల నాయకులు, జిల్లా పరిషత్ ఉద్యోగులు, దారపు శ్రీనివాస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్, అసోసియేషన్ నాయకులు

క్లుప్తంగా

అప్సా ఐకాన్ అవార్డు అందజేత



పెడన: స్థానిక విశ్వభారతీ హైస్కూలు అధినేత అనుమకొండ గౌరీప్రసాద్ అప్సా ఐకాన్ అవార్డును అందుకున్నారు. ఆదివారం విజయవాడ సీతారామ గార్డెన్స్‌లో అప్సా ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరీ ప్రసాద్‌కు అప్సా ఐకాన్ అకడమిక్ అచీవ్‌మెంట్ అవార్డును ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్(అప్సా) రాష్ట్ర అధ్యక్షులు వి.సుబ్రహ్మణ్యరాజు అందజేశారు. విద్యారంగంలో విశిష్టమైన సేవలందిస్తూ, విద్యార్థుల అభివృద్ధి కోసం నిత్యం కృషి చేస్తున్న గౌరీ ప్రసాద్ సేవలను గుర్తించి ఈ అవార్డుతో సత్కరించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉపాధ్యాయ వృత్తి సమాజ నిర్మాణానికి పునాది అని, నాణ్యమైన విద్య అందించడమే తన ప్రధాన లక్ష్యమని గౌరీ ప్రసాద్ తెలిపారు.

వైభవోపేతంగా వేద పండితుల సభ



మచిలీపట్నం టౌన్: స్థానిక పరాసుపేటలోని శ్రీ సువర్చలా సమేత ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి వేద పండితుల సభ అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. వేద పండితులు యజుర్వేదం, ఋగ్వేదం, శుక్ల యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదాలను చదువుతూ వేదసభ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హిందువుల ఐక్యతతోనే ధర్మ రక్షణ



బంటుమిల్లి: హిందువుల ఐక్యతతోనే సనాతన ధర్మ రక్షణ జరుగుతుందని విజయవాడ విభాగ్ కార్యవాహ మేడిశెట్టి పాములు అన్నారు. ఆర్ఎస్ఎస్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా విజయదశమి ఉత్సవం ఆదివారం స్థానిక 'సి కన్వెన్షన్' కల్యాణ మండపంలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన గత 100 ఏళ్లుగా ఆర్ఎస్ఎస్ హిందూ ఐక్యత, ధర్మ రక్షణ కోసం చేసిన కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ నారగం సదావిష్ణురావు, ఖండ కార్యవాహ మాటూరు వెంకటరత్నం పాల్గొన్నారు. ముందుగా స్వయం సేవకులు పలు ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన హిందూ బంధువులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి నిమజ్జనం



గూడూరు: శ్రీ దేవి నవరాత్రి ఉత్సవాల ముగింపు వేడుకల్లో భాగంగా అమ్మవారి నిమజ్జనం కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన గూడూరులోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయం, శ్రీ మాధవస్వామి ఆలయం సెంటర్లలో ఏర్పాటుచేసిన అమ్మవారి నిమర్జనం కార్యక్రమాలు కనులపండువుగా సాగాయి. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై అమ్మవారి విగ్రహాలను ఉంచి మేళ తాళాలు, చిన్నారుల కోలాటాల నడుమ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం రామరాజుపాలెం కాలువలో అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు.

వానర ప్రతిమకు ప్రత్యేక పూజలు



బంటుమిల్లి: మండల పరిధిలోని మల్లపరాజుగూడెం కూడలి వద్ద 1990లో ఓ వానరం రోడ్డు ప్రమాదంలో మరణించింది. దీంతో స్థానికులు ఆ వానరాన్ని సాంప్రదాయ పద్ధతిలో ఖననం చేసి అదే ప్రాంతంలో వానర ప్రతిమను ఏర్పాటు చేశారు. 35 ఏళ్లుగా వానర ప్రతిమకు ఏటా అదే రోజున మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల ప్రారంభించిన ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా వానర ప్రతిమకు స్థానికులు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

గూడూరు: పెడన నియోజకవర్గం యాదవ సంఘం ఆధ్వర్యంలో మండల పరిధిలోని చిట్టిగూడూరు గ్రామంలో ఆరు నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. సంఘం ఏర్పడిన తర్వాత బంటుమిల్లి, కృత్తివెన్ను, పెడన మండలాలతో పాటు గూడూరు మండలంలోనూ పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు కొలుసు చందు తెలిపారు. అనంతరం పేదలకు సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పుట్టి కృష్ణప్రసాద్, వీర్ల కృష్ణ, బోయిన నాగరాజు, పల్లపోతు మోహన్, దండుబోయిన గణేష్, పిల్లంగోళ్ల వెంకటస్వామి, పల్లపోతు అంకరాజు, నూనె కల్యాణ్, ఆరెపు స్వామి తదితరులు పాల్గొన్నారు.

చిట్టూర్పు(ఘంటసాల): ఘంటసాల మండలం చిట్టూర్పు నేతగానివానిపల్లెకు చెందిన రెబ్బా రామచంద్రరావు గత కొన్ని నెలలుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితం అయ్యారు. సమాచారం తెలుసుకున్న మచిలీపట్నంకు చెందిన కారుణ్య సంస్థల అధినేత తూము మధుసూధనరావు అతనికి నిత్యావసర సరుకులను సర్పంచ్ గూడపాటి వెంకటేశ్వరరావుతో కలిసి అందించారు. కార్యక్రమంలో వి.రుద్రవరం మాజీ సర్పంచ్ తూము రామారావు, నాగేశ్వరరావు, ఆర్.కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



చిట్టిగుడూరులో సరుకులు పంపిణీ చేస్తున్న సంఘం ప్రతినిధులు

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

పెడన: పెడనలోని 11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో గల గ్రామాలకు, ఆయా గ్రామాలలోని ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు మచిలీపట్నం విద్యుత్ శాఖ ఈఈ జి.గోవిందరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని ఆయా గ్రామాల ప్రజలు, ఆక్వా రైతులు గమనించి సహకరించాల్సిందిగా ఆయన ఆ ప్రకటనలో కోరారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్మీ వేడుకలు

గూడూరు: హజ్రత్ గౌస్ ఆజం దస్తగీర్ సంస్మరణ వేడుకలలో భాగంగా గుడూరు మండలంలో ముస్లిం సోదరులు గ్యార్మీ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆకులమన్నాడులోని జండా సెంటర్లో నిర్వహించిన వేడుకలలో శనివారం రాత్రి హజరత్ గౌసే ఆజం జీవిత చరిత్ర పుస్తక పఠనం నిర్వహించారు. ఆదివారం భారీ అన్నదాన కార్యక్రమం జరిపారు. పినగూడూరు లంకలో శనివారం రాత్రి ఉరుసు మహోత్సవం నిర్వహించి అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఉచిత వైద్య శిబిరం

మచిలీపట్నం టౌన్: స్థానిక బుట్టాయిపేటలోని మహాత్మ జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో స్థానిక ప్రజలు 275 మంది పాల్గొని వైద్య సేవలు పొందారు. శిబిరంలో మధుమేహం, రక్తపోటు, మూర్ఛలు, పక్షవాతం సంబంధించిన వైద్యనిపుణులు పాల్గొని వారికి సేవలందించారు. విజయవాడ ప్రజా వైద్యశాలకు చెందిన డాక్టర్ మాకినేని కిరణ్, పామర్రుకు చెందిన డాక్టర్ సురేష్ చంద్రారెడ్డి, మచిలీపట్నంకు చెందిన సీనియర్ వైద్యులు కుప్ప రామశాస్త్రి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరాన్ని ప్రముఖ వైద్యుడు గోపాలం శివనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించగా జీబీఆర్ ఫౌండేషన్ సహకారంతో మందులు అందించారు.

కొండలమ్మకు మొక్కుల చెల్లింపు

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధి భక్తులతో ఆదివారం కోలాహలంగా మారింది. మహిళా భక్తులు పాల పొంగళ్లను పొంగించి తమ మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనానికి క్యూలో భక్తులు బారులు తీరారు. భక్తులకు దేవస్థాన చైర్మన్ ఈడే వెంకట విష్ణుమోహన్‌రావు తాగునీరు తదితర కనీస సౌకర్యాలను కల్పించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

అవనిగడ్డ: దేశాభివృద్ధిలో భవిష్యత్తు తరాలకు దిక్సూచీలు ఉపాధ్యాయులని ప్రముఖ పారిశ్రామిక వేత్త విక్కుర్తి శ్రీనివాసరావు అన్నారు. అవనిగడ్డలోని దివి యూనిట్ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకున్న తుంగల చంద్రశేఖర్, కొమ్మినేని ఉదయ కుమార్‌లతో పాటు జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన ఉపాధ్యాయులను శ్రీనివాసరావు ఘనంగా సత్కరించారు. అలానే ఇటీవల పదవీ విరమణ చేసిన ఉద్యోగులు ఎస్‌బీబీవీ ప్రసాద్, మద్ది వెంకటేశ్వరరావు, బి.సాంబశివరావు, బూసిరాజు వెంకటేశ్వరరావు, రావి సునీత, కుక్కల రాజేంద్ర ప్రసాద్, సనకా వెంకటస్వామి, ఎం.లక్ష్మీ నారాయణ, కె.పూర్ణచంద్రరావు, టీవీ సుబ్రహ్మణ్యం, పి.శేషయ్యలను ఆయన సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షులు ఎం.రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి అబ్దుల్ అజీజ్, సంఘం నాయకులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులు, ఉద్యోగులను సత్కరిస్తున్న శ్రీనివాసరావు

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

చినముత్తేవి(మొవ్వ): ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు కృషి చేయాలని సీపీఎం నాయకులు కోరారు. సీపీఎం మొవ్వ మండల కమిటీ సమావేశం ఆదివారం చినముత్తేవి గ్రామంలో అజయ్ కుమార్ భవనంలో బొల్లా సుబ్రహ్మణ్యం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోసూరు శివ నాగేంద్రం మాట్లాడారు. కూటమి ప్రభుత్వం కౌలు దార్లుకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రొఫెసర్ స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం రైతులు పండించే పంటలకు మద్దతు ధరను ప్రకటించటం లేదన్నారు. మరోపక్క కాంప్లెక్స్ ఎరువుల ధరలను పెంచడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకునేలా మద్దతు ధరలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం 15 నెలలుగా ప్రజలపై విద్యుత్ భారాలు మోపిందన్నారు. వామపక్షాల పోరాట ఫలితంగా సుమారు రూ.923 కోట్ల రూపాయలు ట్రూ డౌను పేరుతో తిరిగి ప్రజానీకానికి చెల్లించాల్సిన పరిస్థితి కూటమి ప్రభుత్వానికి ఏర్పడిందన్నారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి శీలం నారాయణరావు, కాకి రాజశేఖర్, కొడాలి కరుణాకర్ రావు, ఉప్పలపు వెంకటాద్రి, కొడాలి శ్రీనివాసరావు, రాంబాబు, సీహెచ్ సుబ్రహ్మణ్యేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సీపీఎం నాయకులు

అర్చకులు, పురోహితులపై గురుతర బాధ్యత

బంటుమిల్లి: వందల ఏళ్లుగా హిందూ సంస్కృతీ సంప్రదాయాలు, సనాతన ధర్మ రక్షణలో ఆలయ అర్చకులు, పురోహితులపై గురుతర బాధ్యత ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. అంతర్జాతీయ గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక రామాలయంలో ఆదివారం పలు గ్రామాలకు చెందిన ఆలయ అర్చకులను, పురోహితుల దంపతులను ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. దేవాలయాల కేంద్రంగా అర్చకులు, పురోహితులు చేసిన కృషితో సనాతన ధర్మం, వేదాలు, భాగవత, భారత, రామాయణాలు ఎలా పరిఢవిల్లింది వివరించారు. తొలిసారిగా అర్చకులను, పురోహితులను గౌరవించి సత్కరించినందుకు వారు నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపి వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం దసరా ముగింపు సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నిర్వహించిన అన్న ప్రసాద వితరణలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కొల్లా శేఖర్, కొప్పర్తి సుబ్బారావు, కొల్లా రామచంద్రరావు, జేటీకే ప్రసాదు, చెక్కా చెన్నకేశవరావు తదితరులు పాల్గొన్నారు.



సత్కారం అందుకున్న అర్చకులు, పురోహితుల దంపతులు

వెంకటస్వామి మరణం పార్టీకి తీరనిలోటు

మాజీ మంత్రి పేర్ని నాని

చిలకలపూడి(మచిలీపట్నం): దావు వీర వెంకటస్వామి(వీరమ్మ) మరణం వైఎస్సార్ సీపీకి తీరనిలోటని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు పేర్ని వెంకట్రామయ్య(నాని) అన్నారు. మండల పరిధిలోని భోగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పార్టీ నాయకులు వెంకటస్వామి మరణ వార్త విన్న నాని ఆయన గ్రామానికి ఆదివారం వెళ్లి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. వెంకటస్వామి పార్టీకి వీరాభిమానిగా పనిచేసేవారని.. పార్టీ బలోపేతానికి ఎనలేని కృషి చేశారని నాని వివరించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు లంకే వెంకటేశ్వరరావు, చిటికిన నాగేశ్వరరావు, పార్టీ సౌత్ మండల అధ్యక్షులు జన్ను రాఘవరావు, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు. అలానే మండల పరిధిలోని ఎస్.ఎన్.గొల్లపాలెం గ్రామంలో సోమన వెంకట నిరంజనరావు పెదకర్మ కార్యక్రమానికి నాని హాజరయ్యారు. కార్యక్రమంలో నార్త్ మండల అధ్యక్షులు మట్టా మోహననాంచారయ్య, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



వీరాస్వామి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పేర్ని నాని

మహిళ ఆత్మహత్య కేసులో నిందితుడిని అరెస్టు చేయాలి

పామర్రు: మండలంలోని కొమరవోలులో మహిళ ఆత్మహత్య కేసులో నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని ఐద్వా సభ్యులు ఎస్ఐ రాజేంద్రప్రసాద్‌కు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా సభ్యులు బి.కీర్తి, పి.రజని, డి.ఆదిలక్ష్మి మాట్లాడారు. కొమరవోలులో నివాసం ఉంటున్న మేడపాటి వసంతను అదే గ్రామానికి చెందిన మేరుగుమాల పవన్ అనే వ్యక్తి నాలుగు నెలల నుంచి లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడన్నారు. ఈ వేధింపులు భరించలేక ఈ నెల 4వ తేదీన ఆ మహిళ ఆత్మహత్యకు పాల్పండిందని తెలిపారు. వేధింపుల కారణం అయిన పవన్‌ను వెంటనే అరెస్టు చేసి, మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.



ఎస్ఐకు వినతిపత్రం అందజేస్తున్న ఐద్వా కృష్ణా జిల్లా కమిటీ సభ్యులు

రావే విద్యార్థుల ఎగ్జిబిషన్ విజయవంతం

ఘంటసాల: ఆచార్య ఎన్జీ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన గుంటూరు లాం సామాజిక విజ్ఞాన కళాశాల విద్యార్థినీల ఎగ్జిబిషన్ కార్యక్రమం విజయవంతం అయ్యింది. ఈ సందర్భంగా విద్యార్థినీలు విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఆదివారం కృతజ్ఞతలు తెలియజేశారు. గుంటూరు లాం సామాజిక కళాశాలకు చెందిన విద్యార్థినీలు గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా వివిధ గ్రామాల్లో పర్యటించి ఆయా గ్రామాల స్థితిగతులు, వనరులు, సామాజిక అంశాలపై అవగాహన పెంచుకున్నారు. పౌష్టికాహారం గురించి అధ్యయనం చేశారు. ఆయా విభాగాల్లో కేవీకేలో శనివారం ప్రదర్శనలు నిర్వహించగా ఆయా కార్యక్రమాల్లో కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి, సామాజిక కళాశాల ప్రతినిధి డాక్టర్ చైతన్య కుమారి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ, అధ్యాపకులు నిర్మల, అపర్ణ, కేవీకే శాస్త్రవేత్తలు కృష్ణవేణి, రేవతి, వెంకటలక్ష్మీ, నవీన్, రైతులు పాల్గొన్నారు.

విద్యాబోధనలో మెలకువలు పాటించాలి

పామర్రు: ఉపాధ్యాయులు విద్యాబోధనలో మెలకువలను పాటిస్తే విద్యార్థులు సులభంగా అర్థం చేసుకుంటారని అంగలూరు డైట్ కళాశాల సీనియర్ అధ్యాపకులు డాక్టరు పి.వినయ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక ప్రగతి విద్యాసంస్థలు మెగా డీఎస్సీ–2025ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు ఇండక్షన్ ట్రైనింగ్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వినయ్‌కుమార్ మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలతో విద్యాబోధన చేయాలన్నారు. ప్రమాణాలను పాటించి విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలన్నారు. కార్యక్రమంలో స్టేట్ రిసోర్స్ పర్సన్‌లు రాయన శివరామ ప్రసాద్, కె.షర్మిల, కె.భవాని, విశ్వనాథ పల్లి నాగరాజులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం



గెట్ టు గెదర్‌లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పామర్రు: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో 1983–84 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం స్థానిక గుడివాడ రోడ్డులోని శ్రీ శ్రీనివాసా రెసిడెన్సీలో గెట్ టుగెదర్ కార్యక్రమం నిర్వహించారు. అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఒకరినొకరు ఆప్యాయంగా ఆలింగనం చేసుకుంటూ మురిసిపోయారు. అనంతరం అందరూ కలిసి ఆట పాటలతో సరదాగా గడిపారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జెమీల్ , త్రివిక్రమ సాయిరాం, హైదర్, సిద్దిక్ పాషా, కేవీవీ లక్ష్మీ, పద్మ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాలి

గుడివాడటౌన్: జనగణనలో కుల జనగణన చేపట్టి జనాభా దామాషా మేరకు బీసీ రిజర్వేషన్లను ఎ,బి, సి,డి లుగా వర్గీకరణ చేసిన తరువాత స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. మల్లేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాజ్యాధికారంలో బీసీలు భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. బీసీలు అధిక సంఖ్యాకులుగా ఉండి కొన్ని సామాజిక వర్గాలు రాజ్యాధికారానికి దూరమవుతున్న నేపథ్యంలో కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే లోపు ఈ నిర్ణయాన్ని తీసుకోవాలని ఆయన కోరారు.